క్లుప్తంగా

18.5 కిలోల గంజాయి స్వాధీనం

- ఎక్సైజ్ అధికారుల అదుపులో ఇద్దరు నిందితులు

తాటిచెట్లపాలెం: తెలంగాణకు అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తులను జ్ఞానాపురం రైల్వే స్టేషన్ సమీపంలో ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాలివి.. విశాఖ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ టీం రవికిరణ్, ముసలనాయుడు, సీతమ్మధార ఎక్సైజ్ సీఐ నాగవేణి, సిబ్బంది సంయుక్తంగా బుధవారం జరిపిన దాడుల్లో ఒడిశా నుంచి హైదరాబాద్‌కు రైలు మార్గంలో గంజాయి తరలించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఒడిశా రాయగడకు చెందిన జిబాన్ జోతిపానీ, ఛత్తీస్‌గడ్‌కు చెందిన ప్రిన్స్ వికాస్ బోర్డన్‌లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 18.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి



కేజీహెచ్‌లో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న డాక్టర్ శివానంద్, వైద్యులు

డాబాగార్డెన్స్/అల్లిపురం/మహారాణిపేట: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి బుధవారం నిర్వహించారు. డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డితో పాటు అదనపు కమిషనర్ ఎస్ఎస్‌వర్మ, పలువురు అధికారులు పాల్గొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డిప్యూటీ లైబ్రేరియన్ పీవీ సూకరాజు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

➡ కేజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.రాధాకృష్ణన్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ యు. శ్రీహరి, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ జి. మెహర్‌కుమార్ ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు.

➡ జిల్లా పరిషత్‌లో సీఈవో పి.నారాయణమూర్తి పంచాయితీరాజ్ మినిస్టీరియల్ స్టాఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు, సిటీ ఎన్జీవో సంఘం జిల్లా జాయింట్ కార్యదర్శి ఎ.మదన్ మోహన్‌రావు, ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు.

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు అన్యాయం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల నిరవధిక సమ్మెకు సీపీఐ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణ మూర్తి ప్రకటించారు. ఉక్కు పరిపాలన భవనం వద్ద బుధవారం చేపట్టిన ఆందోళనకు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్ కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు 8 వేల మందికి ఇప్పటికీ ఉద్యోగాలు లభించలేదన్నారు. ఎన్నికల ముందు ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షిస్తామని, నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని ప్రజాప్రతినిధులు విస్మరించడం దుర్మార్గమన్నారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామన్నారు. ఉక్కు యాజమాన్యం కార్మికులను తొలగించడం సమంజసం కాదన్నారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు 9 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా యాజమాన్యంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు షేక్ రహమాన్, కసిరెడ్డి సత్యనారాయణ, ఎం. మన్మథరావు, ఎస్. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత భోజన మొబైల్ వాహనం ప్రారంభం

గాజువాక: ప్రపంచ ఆకలి దినోత్సవాన్ని పురస్కరించుకొని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ గ్రూప్ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఉచిత భోజన మొబైల్ వాహనాన్ని గాజువాక జోనల్ కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రతీరోజు మధ్యాహ్నం 200 మందికి ఉచిత భోజన వసతి కల్పించేందుకు వీలుగా మొబైల్ వ్యాన్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. మలబార్ గోల్డ్ సంస్థ గాజువాక ఇన్‌చార్జి మహమ్మద్ సాహిన్ ఇసాక్ మాట్లాడుతూ గాజువాక పరిధిలో నిత్యం 200 మందికి ఉచిత భోజనం అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా సతీమణి లావణ్యదేవి, సింహగిరి ఆస్పత్రి అధినేత డాక్టర్ కల్యాణ్, రక్తనిధి ఇన్‌చార్జి వినోద్‌బాబు, మలయాళీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వర్గీస్, బిజూ, గాజువాక మేనేజర్ ఆనంద్, అనూష పాల్గొన్నారు.

ట్రాఫిక్‌తో పరేషాన్

- నిత్యం ట్రాఫిక్ రద్దీతో జగదాంబ.. కలెక్టరేట్ కూడళ్లు
- రాకపోకలకు తప్పని అధిక సమయం
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు.. ఉద్యోగులు



జగదాంబ జంక్షన్ తెన్నేటి పార్కు నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో రద్దీ



జిల్లా పరిషత్ జంక్షన్లో ఇలా..



కలెక్టర్ కార్యాలయం నుంచి కృష్ణా ఆస్పత్రి రోడ్డులో ట్రాఫిక్

డాబాగార్డెన్స్: పెరుగుతున్న వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ సమస్య తప్పడం లేదు. ముఖ్యంగా విద్యార్థులు, రోజువారి కూలీలు, ఉద్యోగులు తమ గమ్యాలకు చేరుకునే వేళ, తిరిగి ఇంటికి చేరుకునే సమయాల్లో సమస్య తీవ్రంగా ఉంటుంది.

కలెక్టరేట్ కూడలి నుంచి జిల్లా పరిషత్‌కు వెళ్లే మార్గం నిరంతరం రద్దీగా ఉంటుంది. ఈ మార్గానికి ఇరువైపులా ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినికల్ లేబొరేటరీలు అధికంగా ఉన్నాయి. ఆయా ఆస్పత్రులు, ల్యాబ్‌లకు రోగులను చికిత్స, పరీక్షల కోసం వాహనాలతో తీసుకు వస్తుంటారు. రోడు చిన్నది కావడం, ఇరువైపులా వాహనాల పార్కింగ్ ఉండడంతో ఈ మార్గంలో వెళ్లే బస్సులు, ద్విచక్ర వాహనాలు, కార్లతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో నడిచేందుకు మార్గం లేక పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వాహనాల రద్దీ వల్ల ప్రతిరోజూ చిన్న చిన్న ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనికి పరిష్కారంగా జిల్లా పరిషత్ కూడలి నుంచి అంకోశా మీదుగా పందిమెట్ట వెళ్లే మార్గంలో కార్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. రోగులను ఆయా ల్యాబ్, ఆస్పత్రుల వద్ద దించి తమ వాహనాలు పందిమెట్టకు వెళ్లే మార్గంలో పార్కింగ్ చేసుకోవచ్చు.

కేజీహెచ్ ఔట్‌గేట్ ఎదుట..

కేజీహెచ్ ఔట్‌గేట్ ఎదుట నిరంతరం ట్రాఫిక్ సమస్య ఉంటూనే ఉంది. అంబులెన్స్‌లు కూడా కదలలేని స్థితి. ఆటోలు, కార్లు, బస్సులు ఈ ప్రాంతంలో కొంత సమయం ఆగాల్సిందే. ఇక్కడ ప్రైవేట్

జగదాంబ జంక్షన్‌లో..

జగదాంబ కూడలి నుంచి ఓ–ఆప్టెక్స్ మీదుగా ఉదయం నుంచి రాత్రి వరకు ఈ ప్రాంతంలో ఆటోవాలాలదే హవా. రోడ్డు మలుపులో ప్రయాణికులను దించేందుకు, ఎక్కించుకునేందుకు ఆటోలను రోడ్డుకు అడ్డంగా నిలిపేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసుల నియంత్రణ లేకపోవడంతో ఇక్కడ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. జగదాంబ, కలెక్టరేట్‌ల మధ్య ఉన్న అరకిలోమీటర్ దూరం చేరుకోవడానికి కనీసం 30 నిమిషాలు పడుతుంది. జగదాంబ నుంచి ఓ–ఆప్టెక్స్ రోడ్డు మలుపులో ఆటోలు నిలపకుండా ట్రాఫిక్ పోలీసులు గట్టి చర్యలు చేపడితే ఈ సమస్య పరిష్కారం అవుతుంది. ముఖ్యంగా ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ చేపట్టాలి.

ఆస్పత్రులు, మందుల షాపులు అధికంగా ఉండడం, ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. ట్రాఫిక్ పోలీసుల నియంత్రణ ఎప్పుడో కాని ఇక్కడ కనిపించదు. దీంతో ఆటోలు ఎక్కడబడితే అక్కడ నిలిపేస్తుంటారు. వాహన రాకపోకలకు అంతరాయంతో పాటు నిరంతరం చిన్న చిన్న ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ఇక్కడ తప్పనిసరిగా ట్రాఫిక్ పోలీసుల నియంత్రణ ఉండాలి. వాహనాలు ఎక్కువ సేపు నిలపకుండా చర్యలు చేపడితే ట్రాఫిక్ సమస్యలు సులభంగా పరిష్కరించవచ్చు.

సెల్లార్లు ఉన్నా..



సెల్లార్లు ఉన్నప్పటికీ ఆ సెల్లార్లలో ఉండే వాచ్‌మేన్‌లు వాహనాలను అనుమతించకపోవడంతో కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. ఇదే అదునుగా ట్రాఫిక్ పోలీసులు వాహనాలు తీసుకుపోవడం.. జరిమానాలు విధించడం పరిపాటిగా మారింది.

– ఎస్. శ్రీనివాసరాజు (రాజేష్), ద్విచక్ర వాహన చోదకుడు

పార్కింగ్ స్థలాలు ఎక్కడ?



ఇది మహా విశాఖపట్నం. స్మార్ట్‌సిటీగా అవతరించింది. నగరం విస్తరించింది. జనాభా పెరిగింది. వాహనాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. అందుకు తగ్గట్టుగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. ఎక్కడైనా పార్కింగ్ చేస్తే భయమేస్తోంది. పోలీసులు ఇష్టానుసారంగా జరిమానాలు విధిస్తున్నారు.

– బండారు లోకేష్‌కుమార్, వాహన చోదకుడు

రాజీవ్‌ను పరామర్శించిన వాసుపల్లి



కొండా రాజీవ్ ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుంటున్న వాసుపల్లి

డాబాగార్డెన్స్: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బుధవారం పరామర్శించారు. భగవంతుని కరుణా కటాక్షాలతో ప్రాణాపాయం తప్పిందన్నారు. అరుణాచలం వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి తీవ్రమైన గాయాలు అయ్యాయని, ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉన్నప్పటికీ సర్జరీ చేయాలని డాక్టర్లు సూచించారని వాసుపల్లికి కొండా రాజీవ్ తెలిపారు. రెండ్రోజుల్లో సర్జరీ జరిగే అవకాశం ఉందని వెల్లడించారు. పార్టీలో మంచి వాక్చాతుర్యం కలిగిన కొండా రాజీవ్‌కి ఇలా జరగడం బాధాకరమన్నారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని వాసుపల్లి ఆకాంక్షించారు.

మద్యం మత్తు.. చేస్తుంది చిత్తు!



చిత్రంలో కనిపిస్తున్నది ప్రమాద దృశ్యం కాదు.. పూటుగా మద్యం సేవించిన వ్యక్తి తానేం చేస్తున్నాడో తెలియనంత మత్తులో ఇలా ఆటో కింద నిద్రపోతున్నాడు. బుధవారం బౌడారారోడ్డులో ఈ దృశ్యం కనిపించింది.

– డాబాగార్డెన్స్

ఔదార్యం చాటుకున్న వాసుపల్లి

- మహిళ వైద్య ఖర్చులకు రూ.5 వేలు అందజేత
- ఆమె కుమార్తెకు ఉద్యోగ కల్పనకు హామీ



ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: కనీసం పోషణ ఖర్చులు కూడా లేని ఓ పేద కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తక్షణ సాయం కింద రూ.5వేలు అందజేసి భరోసా కల్పించారు. నియోజకవర్గ పరిధి 39వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు ముజీబ్‌ఖాన్ సమక్షంలో ఆ వార్డు పరిధి కోటవీధికి చెందిన కర్రి ఆదిలక్ష్మి, ఆమె కుమార్తె జాహ్నవి బుధవారం ఆశీల్‌మెట్ట కార్యాలయంలో వాసుపల్లిని కలిసారు. వాళ్ల పరిస్థితి చూసి చలించిపోయిన వాసుపల్లి గణేష్‌కుమార్ సూచనల మేరకు వైజాగ్ పటం క్లబ్ ప్రెసిడెంట్, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు రాజుపాత్రుడు ఆమె కుమార్తెకు ఉద్యోగం కల్పించనున్నట్లు హామీ ఇచ్చారు. అలాగే 39వ వార్డు నాయకుడు ముజీబ్‌ఖాన్ ఆ నిరుపేద కుటంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందిస్తామని భరోసా కల్పించారు. అలాగే అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఆదిలక్ష్మి మందులు కొనుగోలు చేయలేకపోయిన విషయం తెలుసుకుని ఉచితంగా అవసరమైన మందులు అందిస్తామని వాసుపల్లి అభయం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇటువంటి నిరుపేదలు కూడా సంక్షేమ పథకాలు అందుకొని, కుటుంబ పోషణ చేసుకునేవారు అన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో ఆసరా లేక ఎన్నో పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని మండిపడ్డారు. చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా పవన్ కల్యాణ్.. చంద్రబాబుతో పేదలు, మహిళలకు అందాల్సిన సంక్షేమ పథకాలు చేరవేయాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్‌ను ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పీతల వాసు, భీశెట్టి ప్రసాద్, వద్దాది దిలీప్, గురజాపు రవి, బెవర మహేష్, అప్పారావు, అంబటి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిపై డీఎంహెచ్‌వో ఆగ్రహం



నరసింహనగర్ యూపీహెచ్‌సీలో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: నరసింహనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు బుధవారం సందర్శించారు. ఈ ఆరోగ్య కేంద్రం పలు కార్యక్రమాల అమలులో వెనుకంజలో ఉండడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అభ ఐడి నమోదు, ఎన్‌సీడీసీడీ సర్వే, వ్యాధి నిరోధక టీకాల అమలు వేగవంతం కావాలన్నారు. ఈ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం తగదన్నారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ప్రణాళికాబద్ధంగా జరగాలని, నిర్దేశించిన సూచనల ప్రకారం వ్యాక్సిన్ తెచ్చుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ఓపీ, ల్యాబ్ టెస్టులు, సాధారణ ప్రసవాల గురించి వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆశ కార్యకర్తలు తమ ఏఎన్ఎంలతో కలిసి గర్భిణులకు టీటీ, ఐరన్ ఫోలిక్ మాత్రలు అందేటట్లు, ఎనీమియా బారిన పడకుండా చూడాలని అన్నారు. ఈ సందర్శనలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ లూసీ, నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, డీపీఎంవో, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒకేసారి వికసించిన నాలుగు మే పుష్పాలు



మురళీనగర్‌లో కనువిందు చేస్తున్న మే పుష్పాలు

సీతంపేట: మురళీనగర్‌లో నివసిస్తున్న అరుణ కుమారి అనే మహిళ ఇంటి మేడపై పెంచుతున్న మొక్కల్లో ఒకేసారి నాలుగు మే పుష్పాలు వికసించి కనువిందు చేశాయి. పదేళ్ల కిందట నర్సరీ నుంచి తెచ్చిన మొక్కలను దుంప కుండీలో నాటినట్టు ఆమె తెలిపారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా మే పుష్పాలు వికసిస్తున్నాయని, ఈ ఏడాది ఒకేసారి నాలుగు ఫ్లవర్స్ వికసించి ఆకర్షిస్తున్నాయని చెప్పారు. వీటిని చూడటానికి చుట్టుపక్కల వారు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు.

ఇంటి పన్ను పెంపు నిర్ణయం దుర్మార్గం

- ఉపసంహరించుకోవాలని వార్వా, నివాస్ సంస్థల ధర్నా



ధర్నా చేస్తున్న వార్వా, నివాస్ సభ్యులు

టీచ్‌రోడ్డు: ఆస్తుల సర్వే పేరుతో ప్రాపర్టీ ట్యాక్స్ విలువంటూ ఇంటి పన్ను 20 శాతం పెంచే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని విశాఖపట్నం అపార్ట్‌మెంట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వార్వా) అధ్యక్షుడు ఎస్.ప్రకాశరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వార్వా, నివాస్ సంస్థల సభ్యులు సంయుక్తంగా బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణాల్లో ఆస్తుల సర్వే ద్వారా 20 శాతం అదనంగా ఆస్తిపన్ను సమీకరించాలని రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు ముఖ్యమంత్రి చంద్రబాబ ఇటీవల ఆదేశించారని గుర్తు చేశారు. దానికనుగుణంగా ఈ నెల 14న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రాష్ట్ర విభాగం సర్క్యులర్ జారీ చేసిందన్నారు. నగరాలు, పట్టణాల్లో ఆస్తులను సర్వే చేసి టాక్స్ అసెస్మెంట్ కానివి, పన్ను విధించవలసిన దాని కంటే తక్కువగా టాక్స్ అసెస్మెంట్ జరిగినవి గుర్తించి, వాటిపై సవరించిన ఆస్తి పన్ను, పెనాల్టీలు వేసి, ప్రతి నగరంలో ఆస్తి పన్ను ఆదాయాన్ని 20 శాతానికి తక్కువ కాకుండా పెంచాలని ఆదేశాలు పంపించడం దుర్మార్గమని మండిపడ్డారు. తక్షణమే ఆస్తి పన్ను సర్వే ఆపి, పాత పద్ధతిలోనే ఇంటి పన్ను వసూలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ధర్నాలో నివాస్ అధ్యక్షుడు బి.గురప్ప, వార్వా కార్యదర్శి బీబీ గణేష్, సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ఉమానీలకంఠేశ్వరాలయ హుండీ ఆదాయం రూ. 15.4 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హుండీ ఆదాయం లెక్కించారు. 70 రోజులకు గాను రూ.15,40,000 ఆదాయం వచ్చినట్లు ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో అర్చకుడు మహేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సాహితీవేత్తలకు ప్రతిభా పురస్కారాల ప్రదానం



డి.వి.సూర్యారావును పురస్కారంతో సత్కరిస్తున్న అతిథులు

సీతంపేట: నవసాహితి ఇంటర్నేషనల్, బొంబాయి తెలుగు సాహిత్య సమితి సంయుక్త నిర్వహణలో విశిష్ట ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో నవసాహితి ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎస్.వి.సూర్యప్రకాశరావు తమ సంస్థ కార్యకలాపాల గురించి వివరించారు. ఈ సందర్భంగా గురజాడ కవితా పురస్కారాన్ని కవి కె.జి. వేణుకు, విశిష్ట సాహితీ పురస్కారాలను సాహితీవేత్తలు డాక్టర్ డి.వి.సూర్యారావు, ఆచార్య వెలమల సిమ్మన్నకు ప్రదానం చేసి సత్కరించారు. జర్రా అప్పారావు మాట్లాడుతూ సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉందని, ఆ దిశగా ఉత్తమ సాహిత్య స్రష్టలను సత్కరించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో బొంబాయి తెలుగు సాహిత్య సమితి అధ్యక్షుడు రుద్రాభట్ల శ్రీరాంకుమార్, సాహితీవేత్తలు పిళ్లా రమణమూర్తి, కె.వి.ఎస్.మూర్తి, స్వాతి సోమనాథ్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యకరమైన సమాజం



సీఐ ఎర్రంనాయుడు పర్యవేక్షణలో స్టేషన్ ఆవరణలో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది



పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న టూటౌన్, ఎంఆర్ పేట సీఐ, ఎస్ఐలు, సిబ్బంది

అల్లిపురం: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రం నాయుడు అన్నారు. జోన్ 1 డీసీపీ ఎ.వేజెండ్ల పర్యవేక్షణలో ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం పోలీస్ స్టేషన్ ప్రాంగణాన్ని జీవీఎంసీ సిబ్బంది సహకారంతో పరిశుభ్రం చేశారు. పేరుకుపోయిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు. సీఐ దగ్గరుండి శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లించారు. శాంతి భద్రతల పర్యవేక్షణ, ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు పోలీస్ స్టేషన్ పరిసరాలు శుభ్రంగా ఉంచుకునే బాధ్యత కూడా తమపై ఉందని సీఐ ఎర్రం నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ క్రైం ఎస్ఐ ఎన్.సునీల్, లా అండ్ ఆర్డర్ ఎస్ఐలు ఎన్.సింహాచలం, ఎస్.కాంతారావు, టూటౌన్ సిబ్బందితో పాటు సీసీఎస్, మహారాణిపేట పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా యోగా శిక్షణ తరగతులు



తోటగరువు స్కూల్ మైదానంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఎస్ఏ సిబ్బంది



యోగాసనాలు వేస్తున్న గాంధీనగర్ అర్బన్ హాస్టల్ విద్యార్థులు

ఆరిలోవ: విశాఖలో ఈ ఏడాది జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం కోసం విద్యా శాఖ ఆదేశాలతో సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఏఎల్ఎస్‌సీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఏఎంవో లక్ష్మి, చినగదిలి సీఆర్‌పీఎస్‌లు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు, గాంధీనగర్ అర్బన్ రెసిడెన్షియల్ హాస్టల్‌లో పిల్లలకు యోగాసనాలు నేర్పించారు. 10 నుంచి 18 ఏళ్ల వయసు గల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆసనాలు నేర్చుకున్నారు. యోగా దినోత్సవం వరకు విద్యార్థులకు యోగాసనాల్లో శిక్షణ ఇస్తామని ఏఎల్ఎస్‌వో తెలిపారు.

గృహ విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడ్ రాయితీ

తాటిచెట్లపాలెం: ఏపీఈపీడీసీఎల్ గృహ విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడ్ రాయితీ ఇస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.జ్యోతి, అసిస్టెంట్ ఇంజినీర్ జి.గోపినాథ్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సీతమ్మధార పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు. 'ప్రస్తుతం పాత పద్ధతి ప్రకారం వినియోగదారులు విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. దీని ప్రకారం గతంలో కేవలం లైట్లు, ఫ్యాన్లు, ఫ్రిడ్జ్‌లకు మాత్రమే గృహ వినియోగదారులకు అవకాశం ఉంటుంది. ప్రస్తుత కాలంలో ప్రతి ఇంట్లోనూ లైట్లు, ఫ్యాన్లతో పాటు మిక్సీలు, మోటార్లు, ఏసీలు సర్వసాధారణం. దీని వల్ల ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌పై అదనపు లోడ్ పడుతుంది. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడతాయి. వీటిని తగ్గించేందుకు గృహ విద్యుత్ వినియోగదారులు తమ లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవలసి ఉంటుంది. దీని వల్ల అవసరమైన చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు వేసేందుకు వీలవుతుంది' అని ప్రకటనలో విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకోలేకపోతే తనిఖీల సమయంలో లోడ్ చార్జీలతోపాటు జరిమానాలు చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. జూన్ 30 లోపు అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకున్నట్టయితే వినియోగదారులకు 50 శాతం రాయితీని అందజేస్తామని అధికారులు తెలిపారు. అదనపు లోడ్ రాయితీ కోసం సమీప విద్యుత్ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు అని అధికారులు స్పష్టం చేశారు.